నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన సీపీ



నిమజ్జన ఏర్పాట్లపై సూచనలిస్తున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

కుత్బుల్లాపూర్: గణేష్ నిజ్జనాలు శాంతియుత వాతావరణంలో పూర్తయ్యేలా ఏర్పాట్లు చేయాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి అన్నారు. శనివారం మేడ్చల్ డీసీపీ పరిధిలోని నిమజ్జన ప్రాంతాలను డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ రాములుతో కలిసి పరిశీలించారు. గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలోని సూరారం లింగాచెరువు, వెన్నెలగడ్డ ఎన్నా చెరువుల వద్ద ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిమజ్జనాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అవంఛనీయ ఘటనలకు ఆస్కారం ఇవ్వకుండా బందోబస్తు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అల్వాల్ సీఐ రాహుల్‌దేవ్, ట్రాఫిక్ సీఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీలకు విశేష స్పందన



డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ జ్యోతిరెడ్డి

నిజాంపేట్: నిజాంపేట్ బండారి లేఅవుట్ సంక్షేమ సంఘం, మధు పెయింటింగ్ ఇనిస్టిట్యూట్, స్టోరీ లైన్ టాయ్స్ అండ్ గిఫ్ట్ షాప్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన డ్రాయింగ్ పోటీలకు విశేష స్పందన లభించింది. ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన చిన్నారులకు కార్పొరేటర్ జ్యోతి రెడ్డి, బండారు లేఔట్ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ నరసింహారెడ్డి బహుమతులను అందజేశారు. చిన్నారులు తమ సృజనాత్మకతకు రూపాన్ని ఇవ్వడానికి డ్రాయింగ్ పోటీలు దోహద పడతాయని అన్నారు. నిర్వాహకులు కోటేశ్వరరావు, దశరథి, శ్రీనివాసులును అభినందించారు.

ఎంఎల్ఆర్ఐటీలో ఏసీఎం స్టూడెంట్ చాప్టర్ ప్రారంభం



ఏసీఎం స్టూడెంట్ చాప్టర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ గోపాలకృష్ణ బెహరా

దుండిగల్: దుండిగల్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల (ఎంఎల్ఆర్ఐటీ) కళాశాలలోని సీఎస్ఈ, ఏఐఎంఎల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం అసోసియేషన్ ఫర్ కంప్యూటింగ్ మెషినరీ (ఏసీఎం) స్టూడెంట్ చాప్టర్‌ను ప్రారంభించారు. ఇనిస్టిట్యూట్ ఆడిటోరియంలో ఇంజినీర్స్ డేను పురస్కరించుకుని జరిగిన ఒక గ్రాండ్ ఈవెంట్‌కు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌లో ఎంటర్‌ప్రైజ్ ఆర్కిటెక్ట్ డాక్టర్ గోపాల కృష్ణ బెహరా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ రంగాలకు నేడు ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. ఏసీఎం ప్లాట్‌ఫారం అందించిన అవకాశాలతో తమ కెరీర్‌లో ముందుకు తీసుకెళ్లడానికి విద్యార్థులు ప్రయత్నించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక కోసం పోటీలు



సెలక్షన్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కేపీహెచ్‌బీకాలనీ: రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక కోసం సెలక్షన్ పోటీలు కేపీహెచ్‌బీ కాలనీలోని రమ్యాగ్రౌండ్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ శ్రీనివాసరావు, అధ్యక్షులు పి. రామకృష్ణారావు, ప్రధాన కార్యదర్శి రవీందర్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలోని రోతక్ సిటీలో 43వ జాతీయస్థాయి సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరుగనున్నాయని తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనడానికి రాష్ట్రం నుంచి బాల, బాలికల సబ్ జూనియర్స్ జట్టును ఎంపిక చేసేందుకు రాష్ట్రంలోని 10 జిల్లాల క్రీడాకారులతో రమ్యాగ్రౌండ్స్‌లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన 10 మంది క్రీడాకారులను సబ్ జూనియర్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేపీహెచ్‌బీ కాలనీ భగత్‌సింగ్ స్పోర్ట్స్ క్లబ్ అడ్వైజర్ జాలారి శివనారాయణ రావు, వెంకట్రావు, రామకృష్ణ పాల్గొన్నారు.

'అనుసంధాన్ చట్టం అన్ని రంగాలను ఏకతాటిపైకి తీసుకొస్తుంది'

రాయదుర్గం: దేశంలో పరిశోధనలు పెరిగి సాంకేతికత అందరికీ అందుబాటులోకి వచ్చేందుకు అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్(ఏఎన్ఆర్ఎఫ్) చట్టం-2023 ఎంతగానో ఉపయోగపడుతుందని హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ చట్టం ద్వారా స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్) రంగాలను సామాజిక శాస్త్రాలతో అనుసంధానం చేసేందుకు ఎంతో దోహదపడుతుందని వివరించారు. దేశంలోని పరిశోధనలు, సృజనాత్మకత, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ రంగాలను ఏఎన్ఆర్ఎఫ్ ముందుకు నడిపిస్తుందన్నారు. జాతీయ విద్యా విధానం-2020 ఫిలాసఫీ ఆధారంగా ఏఎన్ఆర్ఎఫ్ పనిచేస్తుందని పేర్కొన్నారు.

పూజలు.. అన్నదానాలు

నియోజకవర్గ వ్యాప్తంగా గణనాథుడి నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం గణేష్ మండపాల వద్ద విశేష పూజలు నిర్వహించి విగ్రహాలను నిమజ్జనాలకు తరలించారు. లడ్డూల వేలం పాట, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో గణనాథులను దర్శించుకుని నిమజ్జనాల్లో పాల్గొన్నారు. – కుత్బుల్లాపూర్



శ్రీరామ్‌నగర్ కాలనీలోని గోదావరి హోమ్స్‌లో..



మైసమ్మనగర్ బి బ్లాక్‌లో..



సృజన యూత్ అసోసియేషన్ గణనాథుడి వద్ద ..



కూరగాయల అలంకరణలో రత్నా ఎన్‌క్లేవ్ అసోసియేషన్ గణపతి



మెట్‌కానిగూడ పోచమ్మ ఆలయంలో..



షాపూర్‌నగర్ రామ్ ఆసుపత్రి వద్ద..



వ్యాలీ అపార్ట్‌మెంట్‌లో కుంకుమార్చనలో మహిళలు



రూ.8.73 లక్షలకు గణపతి లడ్డూను సొంతం చేసుకున్న వంశీమోహన్, మనీష్‌రెడ్డి



సాయిబాబా నగర్‌లో సాయిగణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



వెన్నెలగడ్డలో అన్నదానం చేస్తున్న బండి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

ఆకట్టుకున్న స్పేస్ ఆన్ వీల్స్



కేపీహెచ్‌బీకాలనీ: చిన్నతనంలోనే పిల్లలకు అంతరిక్షం పట్ల ఆసక్తి, అవగాహన కల్పించేందుకు ఇస్రో ఆధ్వర్యంలో రూపు దిద్దుకున్న స్పేస్ ఆన్ వీల్స్ చిన్నారులను ఆకట్టుకుంది. శనివారం ఎస్ఆర్ఎస్ఏ కాలనీలోని కమ్యూనిటీ వినాయక మండపం వద్ద స్పేస్ ఆన్ వీల్స్ బస్సును ఏర్పాటు చేసి చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు అంతరిక్షంపై అవగాహన కల్పించారు. అంతరిక్షంలోకి దూసుకువెళ్లే రాకెట్లు మొదలుకొని శాటిలైట్ సమాచార వ్యవస్థ, సౌర కుటుంబం, రోబో టెక్నాలజీ వంటి అంశాలపై నమూనాలను చూపుతూ వాటి ప్రాధాన్యతను అక్కడి గైడ్‌లు వివరించారు.

పంచశీల పాఠశాలలో హిందీ భాషా దినోత్సవం



హిందీ భాషా దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో శనివారం జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రముఖ హిందీ కవి ప్రేమ్‌చందర్ జయంతిని ప్రతి సంవత్సరం హిందీ భాషా దినోత్సవంగా జరుపుకుంటారు. పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ హిందీ భాష ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలకం



గురువులను సన్మానిస్తున్న నిర్వాహకులు

కుత్బుల్లాపూర్: విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మండల విద్యాధికారి హరిశ్చంద్ర, జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్, గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. గాజులరామారం డివిజన్ పరిధిలోని న్యూ సిటీ ప్యాలెస్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం కుత్బుల్లాపూర్ మండల రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 40 సంవత్సరాల నుంచి బడ్జెట్ పాఠశాలలను నడుపుతున్న సీనియర్ కరెస్పాండెంట్‌లు, ఉపాధ్యాయులను అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో మండల్ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ చైర్మన్ శివయ్య, అధ్యక్షుడు మహేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోశాధికారి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ మండవ శ్రీనివాస్ గౌడ్, నర్సిరెడ్డి, మల్లేష్, రామేశ్వర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్స్, వివిధ పాఠశాలల కరెస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

27న దళిత జర్నలిస్టుల చైతన్య సదస్సు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్, జర్నలిస్టులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: దళిత జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ఈ నెల 27వ తేదీన జర్నలిస్టుల చైతన్య సదస్సు నిర్వహించనున్నట్లు గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి మీసాల ఎల్లేష్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని శనివారం ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. బీఆర్ఎస్ నాయకులు ఉదయకుమార్ యాదవ్, గడ్డం నర్సింగరావు, మేకల హరినాథ్, యాదగిరి, డీజేఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

లింక్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు కృషి



మాట్లాడుతున్న కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

చందానగర్: పాపిరెడ్డి కాలనీ సమీపంలోని లింక్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం పాపిరెడ్డి కాలనీలో నెలకొన్న సమస్యలపై స్థానికులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో సందయ్యనగర్, రాజీవ్ గృహకల్ప, పాపిరెడ్డి కాలనీ, సురభీ కాలనీ, ఆరంభ టౌన్‌షిప్ చుట్టు పక్కల ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యల దృష్ట్యా ఆ సమస్య పరిష్కార దిశగా తక్షణమే రూ.50 లక్షల నిధులు మంజూరు చేయించి లింకు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసి, నిర్మాణ పనులు యుద్ధప్రతిపాదికన టెండరు వేయించి పనులను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీచ్చారు. ఏఈ భాస్కర్, వార్డు సభ్యులు రాంబాబు, రమేష్, వేణు గోపాల్‌రెడ్డి, ప్రభాకర్, రమణయ్య లింగారెడ్డి పాల్గొన్నారు.


కులగణన పోరాటం అసెంబ్లీ, పార్లమెంట్‌ను తాకాలి

రిటైర్డు డీజీపీ డాక్టర్ పూర్ణచంద్రరావు

రాయదుర్గం: విద్యార్థుల కులగణన పోరాటం అసెంబ్లీ, పార్లమెంటును తాకాలని విశ్రాంత డీజీపీ, బీపీసీ ఏపీ కోఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచంద్రరావు అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ప్రధాన గేటు బయట ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఓబీసీఎస్ఏ) ఆధ్వర్యంలో సత్యాగ్రహ పోరాటాన్ని శనివారం ప్రారంభించారు. విద్యార్థుల పోరాటానికి ఆయన సంఘీభావం ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ రాజ్యాధికారం కులగణనతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఇతర విద్యా సంస్థల్లోని విద్యార్థి సంఘాలు ఏఐఓబీసీఎస్ఏ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని పోరాడాలని ఆయన సూచించారు.

ఒంటరి మహిళలే టార్గెట్

- అత్యాచారం చేసి హత్య చేసే భర్తకు భార్య సహకారం
- కేసును ఛేదించిన పోలీసులకు సన్మానం



పోలీస్ సిబ్బందిని సన్మానిస్తున్న ఉన్నతాధికారులు

దుండిగల్: కూలీ పనుల కోసం వచ్చే మహిళలను మభ్యపెట్టి భార్యాభర్తలు కిరాతకంగా వ్యవహరించారు. పని ఉందని చెప్పి భార్యాభర్తలు ఒంటరి మహిళలను నిర్మానుష ప్రాంతానికి తీసుకెళ్తారు. సదరు మహిళపై భర్త లైంగికదాడికి పాల్పడుతుండగా భార్య అతనికి సహకరిస్తుంది. చివరికి బాధిత మహిళను హత్య చేసి ఒంటిపై ఉన్న ఆభరణాలతో ఉడాయిస్తున్నారు. ఈ కేసును ఛేదించి నిందితులకు శిక్ష పడే విధంగా చేసిన పోలీసులను ఉన్నతాధికారులు ప్రశంసించారు. వివరాల్లోకి వెళితే.. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం జనగామం గ్రామానికి చెందిన కురువ స్వామి అలియాస్ రవి(30), మాసమొల్ల నర్సమ్మ అలియాస్ నర్సమ్మ(30) భార్యాభర్తలు. వీరు బతుకుదెరువు నిమిత్తం సంగారెడ్డి జిల్లా ఐడీఏ బొల్లారం సమీపంలోని వైఎస్సార్ కాలనీలో నివాసముంటున్నారు. రవి డ్రైవర్‌గా పని చేస్తుండగా నర్సమ్మ కూలీగా పని చేస్తుంది. 2021 జూలై 25వ తేదీన భార్యాభర్తలు మల్లంపేటలోని అడ్డా పై పనుల కోసం వేచి చూస్తున్న మహిళను(35) కూలీ పనుల కోసం మాట్లాడుకున్నారు. అనంతరం ఆమెను జిన్నారం మండలం మంత్రికుంట గ్రామంలోని అంభిరాల గుట్టకు తీసుకెళ్లారు. పనుల కోసం ఎందుకు నిర్జన ప్రదేశానికి తీసుకువచ్చారని ఆ మహిళ ప్రశ్నిస్తుండగా.. రవి ఆమెపై దాడి చేసి గాయపర్చాడు. అనంతరం మహిళపై లైంగిక దాడికి పాల్పడగా.. భార్య సహకరించింది. అనంతరం ఆమెను బండరాయితో కొట్టి హత్య చేసి ఒంటి ఉన్న ఆభరణాలతో ఉడాయించారు. అప్పట్లో ఈ కేసు సంచలనంగా మారింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలతో నిందితులైన భార్యాభర్తలను అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. విచారణలో మరో రెండు అఘాయిత్యాలకు పాల్పడినట్లు అంగీకరించారు. తాజాగా రంగారెడ్డి జిల్లా కోర్టు కేసు విచారించిన అనంతరం భార్యాభర్తలకు జీవిత ఖైదు విధించింది. దీంతో కేసులో కీలకంగా వ్యవహరించి నిందితులకు శిక్ష పడే విధంగా పని చేసిన దుండిగల్ సీఐ పి.సతీష్, కానిస్టేబుళ్లు బి.బాల్‌రెడ్డి, జె.చిరంజీవీలను శనివారం మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ పురుషోత్తం, ఏసీపీలు బి.శ్రీనివాస్‌రెడ్డి, కె. రాములు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రధాన రోడ్డు మూసివేత



ట్రాఫిక్ రూట్ మ్యాప్

కుత్బుల్లాపూర్: సూరారం కట్టమైసమ్మ చెరువులో గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకొని ఆదివారం నుంచి మంగళవారం వరకు ప్రధాన రోడ్డు మూసివేయనున్నట్లు బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. ఈ మూడు రోజులు గండి మైసమ్మ నుంచి వచ్చే వాహనాలు దూలపల్లి జంక్షన్ వద్ద లెఫ్ట్ టర్న్ చేసుకొని జీడిమెట్ల ఇండస్ట్రియల్ మీదుగా బాలానగర్‌కు వెళ్లాలని, షాపూర్ నగర్ నుంచి సూరారం వెళ్లే వాహనాలు సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద లెఫ్ట్ టర్న్ చేసుకొని బౌరంపేట్ స్నేక్ పార్క్ మీదుగా రాకపోకలు సాగించాలని కోరారు.

సృజనాత్మకతను వెలికితీయాలి



నమూనాలను పరిశీలిస్తున్న ఎం. శ్రీనివాస్‌గౌడ్

కుత్బుల్లాపూర్: విద్యార్థి దశ నుంచే పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని వివేకానంద పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సుభాష్‌నగర్‌లోని వివేకానంద పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంలో భాగంగా సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగి ఉన్న టాలెంట్‌ను వెలికి తీయడానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం. సునీత, వైస్ ప్రిన్సిపాల్ లత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



విద్యార్థులతో పాఠశాల చైర్మన్ టీవీఆర్ కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్: చింతల్ వేంకటేశ్వరనగర్‌లోని బీపీఎస్ ఒలింపియాడ్ పాఠశాలలో శనివారం జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు మాతృ భాష తెలుగుతో పాటు హిందీని కూడా నేర్చుకోవాలని, ఉత్తరాది రాష్ట్రాల్లో పర్యటించే సమయంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పాఠశాల చైర్మన్ టీవీఆర్ కోటిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం



ఉచిత కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న లయన్ సుజాత

చింతల్: లార్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చింతల్ గణేష్ నగర్‌లో నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ సెంటర్‌లో 12వ బ్యాచ్‌కు శనివారం శిక్షణా తరగతులను ప్రారంభించారు. మొదటి రోజు శిక్షణ ప్రారంభోత్సవానికి సంస్థ వ్యవస్థాపకుడు లయన్ సురేష్ కుమార్, శిక్షకురాలు సాయి లక్ష్మి సెంటర్, స్పాన్సర్, లయన్స్ క్లబ్ ఆఫ్ సంస్కృతి హైదరాబాద్ చాప్టర్ మెంబర్ సుజాత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఇప్పటి వరకు సంస్థ ద్వారా 15 మందికి ఉచితంగా కుట్టు మిషన్లను అందజేశామని తెలిపారు. త్వరలో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు.

జోనల్ స్థాయి కబడ్డీ టోర్నమెంట్



కూకట్‌పల్లి: 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కూకట్‌పల్లి, బాలానగర్ జోనల్ స్థాయి కబడ్డీ టోర్నమెంట్ స్థానిక ఎస్ఎస్‌కే పాఠశాల గ్రౌండ్‌లో శనివారం జరిగాయి. కార్యక్రమంలో స్థానిక పాఠశాల చైర్మన్ ఉనియన్, హెడ్ మిసెస్ సుజాత పాల్గొన్నారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో కూకట్‌పల్లి, బాలానగర్ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు కూకట్‌పల్లి జోన్ తరఫున జిల్లా స్థాయిలో పాల్గొంటారని క్రీడా కార్యదర్శి బి. యాదయ్య తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లింగంపల్లి అండర్ బ్రిడ్జి కింద ట్రాఫిక్ దారి మళ్లింపు

చందానగర్: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద నాలా పనులు చేపడుతున్న సందర్భంగా నెల రోజుల పాటు వాహనాలను దారి మళ్లింపు ఉంటుందని రామచంద్రపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గచ్చిబౌలి నుంచి వాహనాలు గుల్‌మోహర్ పార్కు సిగ్నల్ నుంచి నల్లగండ్ల ఫ్లైఓవర్ మీదుగా లింగంపల్లి, బీహెచ్ఈఎల్ చౌరస్తా వరకు దారి మళ్లింపు ఉంటుందన్నారు. అదేవిధంగా చందానగర్, లింగంపల్లి, బీహెచ్ఈఎల్, రామచంద్రపురం నుంచి గచ్చిబౌలి వైపు వెళ్లే వాహనాలు లింగంపల్లి చౌరస్తా నుంచి నల్లగండ్ల ఫ్లైఓవర్ మీదుగా గుల్‌మోహర్ పార్కు సిగ్నల్ నుంచి వెళ్లాలన్నారు.

అలరించిన 'స్వరార్చన'

మాదాపూర్: అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమాస్వార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం కళాకారిమి తనయ నృత్యార్చన కార్యక్రమం, స్రవంతి ఆర్ట్స్ అకాడమీ శిష్యబృందం స్వరార్చన కార్యక్రమంలో సందర్శకులను అలరించారు. స్వరార్చన కార్యక్రమంలో కళాకారులు శ్రావ్య, శ్రీనిక, సుధీశ్, మృదంగం పవన్‌కుమార్, గురువు డాక్టర్ శిరీష కాసినాదుని కలిసి గణేశపంచరత్న, ముద్దుగారే యశోధ, వచ్చెను అలివేలుమంగ అంటు సంకీర్తనలకు నృత్యాభినయాన్ని చేసి సందర్శకులను అలరించారు. పద్మశ్రీ డాక్టర్ శోభరాజు కళాకారులను సన్మానించారు.